క్లుప్తంగా

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో గురువారం ఉదయం 10.30 గంటల నుంచి విద్యుత్ వినియోగదారుల సమస్యలపై పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు సీజీఆర్ఎఫ్ చైర్ పర్సన్, విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి వినియోగదారులు హాజరై, తమ విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలు, సరఫరాలో అంతరాయాలు, మీటరు లోపాలు, కాలిపోయిన మీటర్లు, ఓల్టేజీలో హెచ్చుతగ్గులు, సర్వీసు లోపాలు, కనెక్షన్ మార్పులు, కొత్త కనెక్షన్ జారీలో ఆలస్యం, రీ కనెక్షన్ సమస్యలు, బిల్లుల్లో తప్పులు తదితర వాటిని నేరుగా సీజీఆర్ఎఫ్ కమిటీకి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

400 మంది మహిళలకు చీరల పంపిణీ



పందలపాకలో చీరలు పంపిణీ చేస్తున్న సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: పందలపాకలోని సంతోషిమాత ఆలయం వద్ద బుధవారం 400 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. గ్రామంలోని సూర్యనారాయణరెడ్డి ఫౌండేషన్ అధినేత, సొసైటీ అధ్యక్షుడు పడాల సూర్యానారాయణ రెడ్డి, లక్ష్మీకాంతం దంపతుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. దేవీ నవరాత్రుల సందర్భంగా సంతోషి మాత ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పూజల్లో పాల్గొన్న భక్తులకు వీటిని అందించారు. కార్యక్రమంలోని ఉప సర్పంచ్ పడాల వెంకట రామారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ పడాల వెంకటరెడ్డి, తుమ్మూరి వెంకట రమణ, ముల్లు చిట్టిబాబు, మల్లిరెడ్డి వీర దుర్గాప్రసాద్, రొంగల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ ఆదర్శ క్లబ్‌కు అవార్డులు



అవార్డులతో వాసవీ ఆదర్శ క్లబ్ సభ్యులు

అనపర్తి: అనపర్తి వాసవీ ఆదర్శ క్లబ్‌కు అవార్డులు వచ్చినట్టు ఆ క్లబ్ అధ్యక్షురాలు మన్యం పద్మావతి తెలిపారు. మండపేట మండలం ఏడిదలో బుధవారం జరిగిన నార్కేడ్‌మిల్లి వారి రీకాన్-2025 కార్యక్రమంలో 16 అవార్డులు సాధించామన్నారు. వాసవీ క్లబ్ రీజియన్ చైర్మన్ నార్కేడ్‌మిల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొమ్మిది క్లబ్‌లు పాల్గొన్నాయన్నారు. క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్, బ్యానర్ ప్రజెంటేషన్ , బతుకమ్మ తదితర పలు విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 16 అవార్డులు అందుకుని విజేతలుగా నిలిచామన్నారు. క్లబ్ ప్రతినిధులు చెక్కా గౌరీ, చెక్కా సునీత, వెత్సా రత్నకుమారి, కంచర్ల త్రిపుర తదితరులు రీజియన్ చైర్మన్ సుబ్బారావు చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారన్నారు.

టేబుళ్లు, కుర్చీల వితరణ



కుర్చీలు, టేబుళ్లు అందజేస్తున్న ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు

రంగంపేట: స్థానిక శాఖా గ్రంథాలయానికి పాఠకుల సౌకర్యార్థం బ్యాడ్మింటన్ ఫ్రెండ్స్ క్లబ్ ప్రతినిధులు 8 కుర్చీలు, 2 టేబుళ్లను వితరణ చేశారు. వీటిని బుధవారం గ్రంథాలయాధికారి నల్లమిల్లి రామకోటేశ్వరరావుకు అందజేశారు. బ్యాడ్మింటన్ ఫ్రెండ్స్ క్లబ్ తరపున ఎం.రామకృష్ణ మాట్లాడుతూ గ్రంథాలయాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మహ్మద్ అబ్దుల్ ఖయ్యూం, పెండ్యాల తరుణ్ కుమార్, ముత్యాల రామకృష్ణ, ఎస్.నారాయణ దత్తు, వి.నారాయణ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

సీతానగరం: రఘుదేవపురానికి చెందిన మానుపాటి దుర్గా ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిద్ధా కోటేష్, సూరి లక్ష్మణ్‌లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ బుధవారం తెలిపారు. స్నేహితులైన దుర్గా ప్రసాద్, కోటేష్, లక్ష్మణ్ ఈ నెల 2న మాట్లాడుకుంటుండగా ఒక విషయంలో వాగ్వాదం చోటు చేసుకుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 3న సెంటర్‌లో దుర్గాప్రసాద్‌ను వారిద్దరూ కర్రలు, చేతులతో కొడుతూ, కులం పేరుతో దూషించారు. అడ్డుకోబోయిన దుర్గాప్రసాద్ భార్యను దుర్భాషలాడుతూ దురుసుగా ప్రవర్తించారు. పెద్దల సమక్షంలో రాజీ కుదరకపోవడంతో బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేశామని, డీఎస్పీ విచారణ జరుపుతారని ఎస్సై రామ్ కుమార్ తెలిపారు.

అన్నపూర్ణా నమోస్తుతే..



సంపరలో విజయదుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

రంగంపేట: దసరా శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. రంగంపేట దేవీ సెంటర్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు నాగేంద్ర శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. చంద్రేడులోని కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణగా దర్శనమిచ్చారు. భక్తులు భారీగా తరలివచ్చి అభిషేకాలను తిలకించి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. దొంతమూరు మెయిన్ రోడ్డులోని విజయ దుర్గాదేవి ఆలయంలో దసరా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అర్చకుడు జటప్రోలు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈలకొలను ముత్యాలమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. వడిశలేరులో విజయదుర్గ అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. దొడ్డిగుంట, సింగంపల్లి, కోటపాడు, ముకుందవరం, వడిశలేరు తదితర గ్రామాల్లోని ఆలయాలు, దసరా మండపాల్లో ప్రత్యేక పూజలు జరిపారు.

పెదపూడి మండలంలో..

పెదపూడి: మండల పరిధిలోని ఆలయాలు, దేవీ మండపాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు అన్నపూర్ణగా భక్తులకు దర్శనమిచ్చారు. జి.మామిడాడ, పెదపూడి, పెద్దాడ, సంపర, రామేశ్వరం, దోమాడ, కరకుదురు గ్రామాల్లో అమ్మవార్లకు విశేష పూజలు చేశారు.

బిక్కవోలు మండలంలో..

బిక్కవోలు: గ్రామంలోని గోలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువైన పార్వతీ దేవిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. పందలపాక వెలమపేట రామాలయంలోని శ్రీదేవి అమ్మవారు అన్నపూర్ణగా దర్శనమిచ్చారు. అర్చకుడు గరిమెళ్ల సత్య ప్రకాశరావు ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. కొమరిపాలెం గ్రామంలోని అన్నపూర్ణాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే 500 మంది భవానీ మాలధారులకు సూర్య మోడరన్ రైసు మిల్లు అధినేత మల్లిడి పెద్దిరెడ్డి, మంగయ్యమ్మ దంపతులు భిక్ష ఏర్పాటు చేశారు.



చంద్రేడులో శ్రీదేవి కనకదుర్గమ్మ



వడిశలేరులో విజయదుర్గాదేవి



కొమరిపాలెంలో కనకదుర్గమ్మ

ప్రకృతి సాగుతో ఆరోగ్యకర సమాజం



అనపర్తిలో డ్రోన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

- కలెక్టర్ కీర్తి చేకూరి
- సావరం గ్రామంలో పర్యటన

అనపర్తి: రసాయన రహిత ఆహారం, ఆరోగ్యకర సమాజ స్థాపన కోసం రైతులందరూ ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. ఆమె బుధవారం అనపర్తి మండలం సావరం గ్రామాన్ని సందర్శించి, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో మాట్లాడారు. సామూహిక ప్రకృతి వ్యవసాయ పథకం ద్వారా రైతులు పర్యావరణ హితమైన వ్యవసాయ విధానాలను అవలంబిస్తున్నారన్నారు. వారి నుంచి మిగిలిన రైతులు ప్రేరణ పొందాలని సూచించారు. ప్రకృతి విధానంలో నేలలో సారం పెరిగి, పంటల నాణ్యత మెరుగుపడుతుందన్నారు. ప్రధానంగా సింథటిక్ ఎరువులు, పురుగుమందులు వాడకపోవడం వల్ల ఖర్చు తగ్గడంతో పాటు నాణ్యమైన ఉత్పత్తులు లభిస్తాయన్నారు.

దశల వారీగా అమలు

వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ రైతులు సామూహిక ప్రకృతి వ్యవసాయం పద్ధతులను అనుసరిస్తూ, దశల వారీగా అమలు చేస్తున్నట్లు వివరించారు. విత్తనాలను రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రతి ఎకరానికి 10 కిలోల చొప్పున కొనుగోలు చేస్తున్నారన్నారు. పంటల ఉత్పత్తిలో రసాయనాలపై ఆధార పడకుండా, సహజమైన పద్ధతుల్లో ముందుకు సాగుతున్నారు. అనంతరం డ్రోన్‌తో మందులు పిచికారీ చేయడం, వీడర్‌తో విత్తనాలు చల్లడం తదితర అంశాలను ప్రదర్శించి కలెక్టర్‌కు చూపించారు. కార్యక్రమంలో అనపర్తి సర్పంచ్ వారా కుమారి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ఏపీ సీఎంఎఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ తాతారావు, రైతులు కె.సత్యనారాయణ (చిట్టిబాబు), కె.విశ్వనాథరెడ్డి, ఎంపీపీ రాఘవరెడ్డి, ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంపాదనే ఎమ్మెల్యే ప్రధాన ధ్యేయం

- నియోజకవర్గంలో మంచిపై చెడు వికటాట్టహాసం
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



అనపర్తి: బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి రాజకీయాల్లోకి వచ్చింది ప్రజాసేవ కోసం కాదని, సంపాదన కోసమేనని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన అనపర్తిలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే చేష్టలను చూస్తుంటే ఆయన లక్ష్యమేమిటో తెలుస్తోందన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దసరా పండగ జరుపుకొంటామన్నారు. కానీ అనపర్తి నియోజకవర్గంలో మాత్రం అందుకు భిన్నంగా మంచిపై చెడు వికటాట్టహాసం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతుల చెమట రక్తమైందని, పేదోడి బియ్యం దోపిడీకి గురైందని, ఆలయ నిధులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఏడాదిన్నర కాలంలో నల్లమిల్లి గ్రామంలోని జగన్నాథ సాగర చెరువు, బిక్కవోలు లింగాల చెరువుల్లో అక్రమంగా భారీ స్థాయిలో మట్టి తవ్వకాలు చేశారని ఆరోపించారు. అనపర్తి – కొప్పవరం – తొస్సిపూడి రహదారిపై ఎమ్మెల్యే అనుచరులు భారీ లారీలు, టిప్పర్లతో అక్రమంగా మట్టిని తరలించి రోడ్డును సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదోడి రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించి రూ.కోట్లలో అక్రమ సంపాదన ఆర్జిస్తున్నారన్నారు. మిల్లర్లతో కుమ్మక్కై, రైతులకు ఎకరానికి రూ.10 వేల వరకూ నష్టం వాటిల్లినట్టు రైతుల వీడియోను బహిర్గతం చేశారు. పెదపూడి మండలం పైన గ్రామ సొసైటీ నిధులను దారి మళ్లించగా, కుతుకులూరు ఆంజనేయ స్వామి ఆలయ నిధులు రూ.73 లక్షలకు లెక్కా పత్రం లేదన్నారు. 2014–19 మధ్య కుతుకులూరు, పొలమూరు, పందలపాక సొసైటీలకు చెందిన రూ.80 లక్షలు మాయం చేశారన్నారు. రామవరంలో గోవా తరహా క్యాసినోలు, పేకాట క్లబ్‌లు నిర్వహిస్తున్నారన్నారు. ఇదేనా కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమం అని ప్రశ్నించారు.

క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సాహం అందిస్తే యూనివర్సిటీ ఖ్యాతి పెంపొందించే రీతిలో వారి ఎదుగుదల ఉంటుందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్సిటీ ఈసీ హాలులో బుధవారం స్పోర్ట్స్ బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆల్ ఇండియా ఫిజిక్ ఛాంపియన్ షిప్ పోటీలను త్వరలో 'నన్నయ' వర్సిటీలో నిర్వహించనున్నామని, వీటిని విజయవంతం చేయడంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రతిభా వంతులైన క్రీడాకారులు ఎందరో ఉన్నారని, వారందరికీ నన్నయ వేదిక కావాలన్నారు. అన్ని అనుబంధ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్లు ఉండాలని, విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ మూర్తి, కో ఆర్డినేటర్లు పి.విజయనిర్మల, కె.సుబ్బారావు, పి.ఉమామహేశ్వరీదేవి, ఎస్.లింగారెడ్డి, ఎస్.విజయమోహన్ తదితరులు పాల్గొన్నారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

గృహ నిర్మాణ లక్ష్యాలు పూర్తి చేయాలి



బిక్కవోలులో లేఅవుట్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ నాతి బుజ్జి

బిక్కవోలు: గృహ నిర్మాణం పథకంలో ఇచ్చిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఆ శాఖ పీడీ నాతి బుజ్జి అన్నారు. ఆమె బుధవారం బిక్కవోలు లే అవుట్ – 1ను పరిశీలించారు. అక్కడ 658 మందికి గత ప్రభుత్వంలో స్థలాలు మంజూరు చేశారు. వాటిలో ఇప్పటికి 248 గృహాలు పూర్తయ్యాయన్నారు. వీరికి పూర్తిగా సాయం అందించామని గృహ నిర్మాణ శాఖ డీఈఈ వి.వనమయ్య వివరించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ నాతి బుజ్జి మాట్లాడుతూ తరచూ లబ్ధిదారులను కలిసి, గృహ నిర్మాణం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సుప్రియ, పరిపాలనా అధికారి నాగేంద్ర ప్రసాద్, మండల ఇంజినీరింగ్ అధికారి రామిరెడ్డి, హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: ప్రభుత్వం మంజూరు చేసిన నివాస స్థలాలలో చేపట్టిన గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ నాతి బుజ్జి.. లబ్ధిదారులకు, అధికారులకు సూచించారు. మండలంలోని మల్లంపూడిలో లేఅవుట్లను బుధవారం ఆమె సందర్శించారు. అక్కడ జరుగుతున్న నిర్మాణ పనుల ప్రగతిని సమీక్షించారు. వివిధ కారణాలతో పనులు నెమ్మదించడాన్ని గుర్తించిన ఆమె ఆయా సమస్యలపై అధికారులను ఆరాతీశారు. అలాగే మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా పరిసరాలను పరిశీలించారు. ఆమె వెంట గృహ నిర్మాణ శాఖ అధికారులు ఉన్నారు.

పశుపోషణలో మెళకువలు పాటించాలి



శిబిరంలో టీకా వేస్తున్న పశుసంవర్ధకశాఖ సిబ్బంది

అనపర్తి: పశుపోషణలో మెళకువలు పాటిస్తే ఖర్చు తగ్గించుకోవడంతో పాటు నాణ్యమైన ఉత్పత్తులు సాధించవచ్చని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పశు సంవర్ధకశాఖ, ప్రాంతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పీరా రామచంద్రపురంలో ఏర్పాటు చేసిన పశు వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ టి..రామచంద్రారెడ్డి మాట్లాడుతూ శిబిరంలో 100 పశువులకు గర్భాకోశ వ్యాధులకు వైద్య సేవలు అందించామన్నారు. వంద గుది ఆపరేషన్లు, సుమారు 120 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ ఉప సంచాలకులు డాక్టర్ కె.కాంతారావు, డాక్టర్ మక్కేన వెంకటేశ్వర్లు, సహాయ సంచాలకులు వై.శ్రీనివాసరావు, ప్రాంతీయ పశువైద్యశాల అనపర్తి డాక్టర్ వీజీఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటకం ప్రదర్శన



నాటకం ఆహ్వాన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వనరాజు తదితరులు

సీతానగరం: మండలంలోని ముగ్గళ్ల గ్రామంలో శుక్రవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటకను ప్రదర్శిస్తున్నట్టు బుద్ధవనం లైబ్రరీ అధ్యక్షుడు గుడిసే వనరాజు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఇనుగంటివారిపేట, ముగ్గళ్ల గ్రామాలకు చెందిన బుద్ధవనం లైబ్రరీ టీమ్, అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఈ నాటకాన్ని ప్రదర్శిస్తుందన్నారు. ముగ్గళ్ల అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు వద్ద గల వాలీబాల్ మైదానంలో సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. అనంతరం నాటక ఆహ్వాన పోస్టర్లను ఆవిష్కరించారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం



తొస్సిపూడిలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి తదితరులు

రంగంపేట: మహిళలు తమ ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి అన్నారు. ఎస్టీ రాజాపురంలోని సచివాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 40 ఏళ్లు దాటిన మహిళలు ఏటా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ శిబిరానికి హాజరైన 193 మంది మహిళలకు బీపీ, సుగర్, హెచ్‌బీ పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అవసరమైన మహిళలకు సర్వైకల్ క్యాన్స్ స్క్రీనింగ్, ఓరల్ క్యాన్సర్ స్క్రీనింగ్, బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వి.తులసీదాస్, పీహెచ్ఎన్ కె.మేరీ హెలేనా, ఎంపీహెచ్ఎస్ కె.రామ్మోహన్ పాల్గొన్నారు.

- సింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బాలవరంలో డాక్టర్ జయవర్ధిని ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 213 మంది మహిళలకు వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు.

రాజానగరం: మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆయా కుటుంబాలు కూడా బాగుంటాయని పాలచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యులు డాక్టర్ బెనిడెక్ట్ విజ్ఞప్తి చేశారు. లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్వహించిన శిబిరంలో మహిళలకు వైద్య సేవలు అందించారు.

బిక్కవోలు: స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తొస్సిపూడిలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 69 మందికి కొంకుదురు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ జి.విజయలక్ష్మి సేవలందించారు. అనంతరం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ తేతలి సుమ, సర్పంచ్ కొవ్వూరి సీతారత్నం, మాజీ ఉప సర్పంచ్ తేతలి సూర్యచంద్రారెడ్డి పాల్గొన్నారు.

గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అశోక్ కుమార్, చిత్రంలో ఎంపీపీ సూర్యకుమారి

కోరుకొండ: స్థానిక మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరు కాని 11 ప్రభుత్వ శాఖల అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వనున్నట్టు ఎంపీడీఓ బత్తిన అశోక్ కుమార్ తెలిపారు. కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సమాచారాన్ని ముందుగా తెలియజేసినప్పటికీ సంబంధిత శాఖల అధికారులు హాజరుకాకపోవడం సబబు కాదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సమష్టిగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. అలాగే మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. గౌరవ వేతనాన్ని అందించాలని ఎంపీటీసీ సభ్యులు ఎంపీడీఓను కోరారు. గృహ నిర్మాణ, పంచాయతీరాజ్, ఎన్ఆర్ఈజీసీ తదితర శాఖలకు చెందిన సమస్యలపై గుమ్ములూరు సర్పంచ్ నక్కా రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు గళమెత్తారు. ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్య సూర్యకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, వైఎస్ ఎంపీపీ బొర్స నాగమణి పాల్గొన్నారు.

శాకంబరిగా అమ్మవారు




శాకంబరి అలంకరణలో శ్యామలాంబ

పెదపూడి: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం పెదపూడి సోమేశ్వర స్వామి ఆలయంలో శ్యామలాంబ అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు కొమ్మాల్లపల్లి వెంకట్రావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సొసైటీలతో వ్యవసాయాభివృద్ధి

కోరుకొండ: గ్రామీణ ప్రాంతంలోని సహకార సంఘాల ద్వారా వ్యవసాయరంగం అభివృద్ధి సాధ్యమవుతోందని రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. కోరుకొండలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మండపంలో బుధవారం శ్రీరంగపట్నం సొసైటీ చైర్‌పర్సన్ అడపా వీరబాబుతో పాటు త్రీమన్ కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తనకాల నాగేశ్వరరావు, కంటే నాగాశేశవరావు, దొర పాల్గొన్నారు.

విద్యార్థుల ఇండస్ట్రియల్ టూర్



అనపర్తి సబ్ స్టేషన్‌లో పనితీరును విద్యార్థులకు వివరిస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

అనపర్తి: విద్యార్థుల్లో మానసిక వికాసానికి ఇండస్ట్రియల్ టూర్లు దోహదపడతాయని అనపర్తి శ్రీరామారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పులగం వెంకట రెడ్డి అన్నారు. ఆ పాఠశాలలోని 9, 10 తరగతుల విద్యార్థులకు విద్యుత్ సరఫరాపై అవగాహన కల్పించడానికి బుధవారం సబ్ స్టేషన్‌కు ఇండస్ట్రియల్ టూర్ వేశారు. వారికి పవర్ డిస్ట్రిబ్యూషన్, పరికరాల టెక్నాలజీ విధానాన్ని ఇంజినీరింగ్ అధికారులు వివరించారు.

సచివాలయ ఉద్యోగుల ఆందోళన



నల్ల రిబ్బన్లు ధరించి ఆందోళన చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

సీతానగరం: తమ న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాలంటూ మండలంలోని సచివాలయం ఉద్యోగులు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నల్ల రిబ్బన్లు ధరించి ఆందోళన నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు, ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిపారు. ఉద్యోగులను మాతృశాఖలకు పంపించాలని, జూనియర్ అసిస్టెంట్ స్కేల్ అమలు చేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ప్రభుత్వ సెలవు దినాల్లో బలవంతపు పనులు అప్పగించరాదన్నారు. జిల్లా కో కన్వీనర్ పి.బాలరజని మాట్లాడుతూ ఉద్యోగులు తమ విధులను బాధ్యతగా నిర్వహిస్తూనే, కేవలం నల్లబ్యాడ్జీలు ధరించి తమ ఆవేదనను ప్రభుత్వానికి తెలియజేస్తున్నామన్నారు.

యువతి అదృశ్యం

బిక్కవోలు: మండలంలోని ఆర్ఎస్‌పేట చెందిన పి.దుర్గా శిరీష అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఆర్ఎస్‌పేట చెందిన పి. పుష్పవతి, వెంకట రమణ భార్యాభర్తలు. లారీ డ్రైవర్‌గా పనిచేసే వెంకట రమణ ఈ నెల 23న డ్యూటీకి వెళ్లాడు. పుష్పవతి తన కుమార్తె దుర్గాశిరీషను తల్లిదండ్రులకు అప్పగించి, కుమారుడితో కలిసి జగ్గంపేట వెళ్లింది. అదే రోజు సాయంత్రం 4 గంటలకు తిరిగి వచ్చేసరికీ కుమార్తె కనిపించలేదు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిట్టిబాబు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు మాట్లాడుతూ మహాత్మాగాంధీ, మదర్ థెరిస్సా వంటి మహనీయుల స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ ఎం.సుధామయి, అధ్యాపకులు పాల్గొన్నారు.